క్లుప్తంగా

నాగుల పంచమి పూజలు



నాగదేవత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానంద నగర్ కాలనీలోని నాగదేవత ఆలయంలో నాగుల పంచమి సందర్భంగా సోమవారం భక్తులు ఉదయం నుంచి పూజలు చేయటానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా నాగదేవతకు ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. అంతేకాకుండా ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.శివయ్య, కోశాధికారి బి.సాంబ, కమిటీ సభ్యులు కె.సత్యనారాయణ, పి.కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టెక్నో క్రాట్స్ స్వర్ణోత్సవాలు



ఎంఈఐ లిమిటెడ్ అధినేత పీపీ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బాలానగర్: బాలానగర్‌లోని టెక్నో క్రాట్స్ అసోసియేషన్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్‌లోని రూబి టవర్‌లో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మెగా ఇంజినీరింగ్ సంస్థ చైర్మన్ పీపీరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పారిశ్రామికవాడ దినదినాభివృద్ధి చెందుతూ వేలాదిమంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తోందన్నారు. అనంతరం అసోసియేషన్ మాజీ అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం పరిశ్రమలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులకు మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లోకేష్ మెషిన్ టూల్స్ అధినేత లోకేశ్వర రావు, డైనమిక్ టూల్స్ అధినేత జీఆర్ సూర్యరాజ్, వసంత టూల్స్ క్రాఫ్ట్స్ అధినేత దయానంద రెడ్డి, టెక్నో క్రాట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వాసుదేవరావు, జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వృత్తి నైపుణ్య శిక్షణ అవసరాన్ని గుర్తించాలి

ఎస్వీ యూనివర్సిటీ ప్రొ.మురళీధర్

రాయదుర్గం: వృత్తి నైపుణ్యాలు నేర్చుకోవాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొఫెసర్ బీవీ మురళీధర్ అన్నారు. మనూలో యూజీసీ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో రాజనీతిశాస్త్రంలో రిఫ్రెషర్ కోర్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు శిక్షణ పొందిన అంశాలను విద్యార్థులకు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్ మాట్లాడుతూ రిఫ్రెషర్ కోర్సులు ఉత్తేజాన్ని ఇస్తాయన్నారు.

4 సిట్టింగ్‌లకే..

బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా వెల్లడి



- ఉప్పల్‌లో మాత్రం బండారి లక్ష్మారెడ్డి ఖరారు
- ఆశావహులకు తప్పని భంగపాటు.. పక్కచూపులు చూస్తున్న నేతలు
- తనయుడు జెడ్పీ చైర్మన్ కావడంతో.. డైలమాలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- మేడ్చల్ టికెట్‌పై హామీ ఇస్తే కాంగ్రెస్‌కు మారే అవకాశం..!
- వ్యతిరేక చర్యలకు పాల్పడితే వేటు తప్పదని అధినేత హెచ్చరిక

సాక్షి, మేడ్చల్ జిల్లా: అధికార బీఆర్ఎస్ ముందస్తుగా అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వచ్చే ఎన్నికల్లో పోటీకి ఉప్పల్ సెగ్మెంట్ మినహాయించి మిగతా మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అవకాశం కల్పించారు. దీంతో మరో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా అభ్యర్థులను మార్చనున్నారనే రాజకీయ వర్గాల ఊహాగానాలకు తెరపడినట్లయింది. అధిష్ఠానం ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల్లో నలుగురు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, ఒకరు మాత్రమే బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉండటం విశేషం. ఇదిలా ఉంటే గతకొంత కాలంగా ఎమ్మెల్యే టికెట్‌పై ఆశలు పెంచుకున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు, మాజీ మేయరు బొంతు రామ్మోహన్ ఆశావహులకు ఈ సారి కూడా నిరాశే మిగిలింది. మళ్లీ టికెట్ లభించగలదని ఆశ పడిన ఉప్పల్ సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి అధిష్ఠానం మొండి చెయ్యి చూపింది. తండ్రుల స్థానంలో తనయులు చామకూర మహేందర్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్‌లు పోటీ చేయాలని భావించినా భంగపాటు తప్పలేదు.

ఆశావహులకు భంగపాటు

మేడ్చల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి టికెట్ ఆశించినా భంగపాటు తప్పలేదు. గత ఏప్రిల్ మాసంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన సందర్భంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధినేతల సమక్షంలోనే వాగ్వాదాలు, తోపులాటలకు దిగిన విషయం తెలిసిందే.. మేడ్చల్ నుంచి మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థిని తానేనని పలు ఆత్మీయ సమ్మేళనాల్లో ప్రకటించటంతోపాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో సహా ఆయన తనయుడు జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి ఆహ్వానించకపోవడం వంటి విషయాల నేపథ్యంలో ఇరువురి మధ్య విభేదాలు పొడచూపినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగింది.

పార్టీ వ్యతిరేక విధానాలకు..

బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం.. జిల్లాతో సహా నియోజకవర్గాల్లో నాయకులు, కేడర్ అంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించింది. అలా కాకుండా.. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆ పార్టీ అధినేత కేసీఆర్ హెచ్చరించడం వంటి విషయాలు కూడా పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి.

ఏ నియోజకవర్గంలో ఎవరంటే..?

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇందులో నాలుగింటిలో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అధిష్ఠానం అవకాశం కల్పించింది. సిట్టింగ్ స్థానాలైన మేడ్చల్ నియోజకవర్గం నుంచి మంత్రి చామకూర మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ నుంచి కేపీ వివేకానందగౌడ్, కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి మైనంపల్లి హన్మంతరావును బీఆర్ఎస్ అభ్యర్థులుగా అధిష్ఠానం ప్రకటించింది. ఉప్పల్ నియోజకవర్గంలో మాత్రం బండారి లక్ష్మారెడ్డినికి అభ్యర్థిగా ఖరారు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన బండారి లక్ష్మారెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్న చర్చ ఆయన అనుచర వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో మళ్లీ సిట్టింగ్ అభ్యర్థులకే టికెట్లు ప్రకటించి, అందరినీ ఆశ్చర్యంలో ముంచేశారు. ఎన్నికలకు మరో మూడు మాసాల గడువు ఉండగా, అభ్యర్థులను ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మిగతా నియోజకవర్గాల్లోనూ..

కుత్బుల్లాపూర్ నుంచి ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు టికెట్ ఆశించారు. అలాగే, కూకట్‌పల్లి నుంచి మరో ఎమ్మెల్సీ నవీన్ రావు కూడా టికెట్ ఆశించి భంగపడ్డారు. వీరిలో ఏ ఒక్కరిపై కూడా అధిష్ఠానం మొగ్గు చూపకపోవడం విశేషం. పార్టీ కోసం కష్టపడి పని చేసినా.. ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వారంతా అధిష్ఠానంపై గుర్రుగా ఉన్నారు. అవకాశం కోసం కొందరు పక్క చూపులు చూస్తున్నారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే తనయుడు మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతుండటం వల్ల పార్టీ మారే విషయంపై మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డైలమాలో ఉన్నట్లు తెలుస్తోంది. పైగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ టికెట్ ఇస్తానని హామీ ఇచ్చినట్లయితే కూడా.. బీఆర్ఎస్‌ను వీడే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది.

రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి





గౌతమ్‌నగర్‌లో వడ్డేపల్లి రాజేశ్వరరావు ర్యాలీలో పాల్గొన్న ఈటల రాజేందర్, బీజేపీ నాయకులు

బాలానగర్: కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన నిరుద్యోగభృతి, ఉద్యోగాల కల్పనలో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే నరేంద్ర మోదీ సహకారంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి పేదలకు అందజేస్తామని రాష్ట్ర బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఫతేనగర్ డివిజన్‌లోని గౌతమ్‌నగర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర 50వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సూర్యారావు, సూర్యప్రకాష్, ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ కృష్ణ గౌడ్, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ఓబీసీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బూరుగుపల్లి రామ్మోహన్, నాయకులు రఘు, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి పరీక్షలు

మోతీనగర్: బంజారాహిల్స్ లయన్స్ క్లబ్ 320ఎ ప్రెసిడెంట్ కెల్లా వెంకట్రావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లోని సుమారు 600 మంది విద్యార్థులకు సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ రోడ్డులోని హోలిస్టిక్ ఆస్పత్రి వైద్యులు ఆధ్వర్యంలో కంటి సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి మెరుగైన చికిత్స, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్ కైలాష్, శ్రీకాంత్, జగన్నాథం, పీఆర్‌కే ప్రతాప్, ఆదినారాయణ, నాగుల సత్యం, జి. సత్యనారాయణ, వైద్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటిని పరీక్షలు చేస్తున్న వైద్యులు

సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లో కాలనీ వాసులతో కలిసి సమస్యల పరిష్కారానికి సోమవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర చేపట్టారు. ముందుగా ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం పాదయాత్ర ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లో అభివృద్ధి పనులన్నీ దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులను వెంటనే పూర్తి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. స్థానికులు కొందరు కాలనీలో వీధి దీపాలు వెలగటం లేదని ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే వీధి లైట్లను మార్చి సమస్య పరిష్కారించాలని సంబంధి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, రాజేష్ చంద్ర, కాశీనాథ్‌యాదవ్, గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆల్విన్‌కాలనీ ఫేజ్1లో సమస్యల పరిష్కారానికి పాదయాత్ర చేసిన కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

మహాత్మాగాంధీ నగర్‌లో...

ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మాగాంధీనగర్ రోడ్డు నం.3లో రూ.15 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు.

పోలీస్‌క్వార్టర్స్ సమస్యలపై చర్యలు తీసుకోవాలి

బాలానగర్: డివిజన్ పరిధిలో శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్స్‌ను సోమవారం ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి పోలీస్‌క్వార్టర్స్‌ను సందర్శించారు. సుమారు 30 ఏళ్ల నిర్మాణం కావటంతో శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. ప్రజల శ్రేయస్సు కోసం పోరాడే పోలీసులకే ఈ నిర్మాణంతో రక్షణ కరువైందని ఎద్దేవా చేశారు. క్షణక్షణం ఎప్పుడు ఏమి జరుగుతుందోనని పోలీసులు కుటుంబ సభ్యులు తమ గోడును ఆయనకు తెలిపారు. భయాందోళన మధ్య నివసిస్తున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పోలీస్ హౌసింగ్ బోర్డు సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో వారి తరపున పోరాటం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, బాలానగర్ మాజీ ఉపాధ్యక్షుడు ఆకుల నరేందర్, సీనియర్ లీడర్ రిషియాదవ్, బాలకృష్ణ, నయీమ్, మైలా, ముఖ్తార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో శిథిలావస్థకు చేరిన పోలీస్‌క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి

మళ్లీ సిట్టింగ్‌లకే చాన్స్..

- కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు టిక్కెట్లు కేటాయింపు
- ఆనందంలో స్థానిక బీఆర్ఎస్ నేతలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా తిరిగి మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీలకు టిక్కెట్ కేటాయించటం పట్ల పలువురు కార్పొరేటర్‌లు, బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మూడోసారి ఎమ్మెల్యే కృష్ణారావు, అరెకపూడి గాంధీలను గెలిపించి హ్యాట్రిక్ విజయం అందిస్తామని తెలిపారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలను తిరిగి ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తిరిగి భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

హ్యాట్రిక్ విజయంపై గురి!

- కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాధవరం కృష్ణారావు
- బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించడంతో కార్యకర్తల్లో హర్షాతిరేకాలు
- ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని అంటున్న నేతలు
- బాణాసంచా కాల్చుతూ.. మిఠాయిలు పంచిన కార్యకర్తలు



కూకట్‌పల్లి: నాలుగు దశాబ్దాల క్రితం సామాన్య కార్యకర్తగా ఉన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ టికెట్‌ను కేటాయించింది. దీంతో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఆనందోత్సాహంతో సంబురాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చుతూ.. మిఠాయిలు పంచుతూ తమ హర్షం వ్యక్తం చేశారు. తమ ఎమ్మెల్యే కృష్ణారావును గెలిపించుకోవడానికి అహర్నిశలు కష్టపడతామని పార్టీ కార్యకర్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. హ్యాట్రిక్ విజయం నమోదు చేసి సీఎం కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. వరుసగా మూడోసారి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సిద్ధమయ్యారు.

సాధారణ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం

◆ కూకట్‌పల్లి గ్రామంలో 1985లో సామాన్య టీడీపీ కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కృష్ణారావు జగద్గిరిగుట్టలో వార్డు అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా, తెలుగు యువత కూకట్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 1993నుంచి 2001వరకు కూకట్‌పల్లి మున్సిపాలిటీలో టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. అదే సమయంలో కూకట్‌పల్లి మున్సిపాలిటీలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలుపొంది వైస్‌చైర్మన్‌గా నియమితులయ్యారు.

2009లో టికెట్ ఇవ్వకపోయినా పార్టీతోనే..

◆ అప్పటి నుంచి రాజకీయంగా వెనుకడుగు వేయని కృష్ణారావు వైస్‌చైర్మన్ పదవీకాలం అయిపోయిన తర్వాత 2009లో ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించారు. పొత్తుల్లో భాగంగా అప్పుడు టిక్కెట్ దక్కలేదు. నిరాశ చెందకుండా పార్టీనే నమ్ముకొని నియోజకవర్గంలో ఉన్న కార్పొరేటర్లను పిలిపించుకొని ఒంటి చేత్తో పార్టీని నడిపించారు.

ప్రజల ఆకాంక్ష మేరకు బీఆర్ఎస్‌లోకి...

◆ ఆ తర్వాత వచ్చిన ఎన్నికల్లో మాధవరం కృష్ణారావు 2014లో టీడీపీ టిక్కెట్‌పై విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల ఆకాంక్ష మేరకు కార్యకర్తల అభిప్రాయంతో పార్టీ మారాల్సి వచ్చింది. అప్పటి నుంచి కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి అవిశ్రాంతంగా పనిచేశారు. రూ.2500కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.


మొదటిసారి టీడీపీ నుంచి రెండోసారి బీఆర్ఎస్ నుంచి విజయం..

గతంలో తెలుగు దేశం పార్టీ తరపున ఒక్కసారి, మరోసారి బీఆర్‌యస్ తరపున పోటీ చేసి 40వేల ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. రెండోసారి నగరంలోనే అత్యధిక మెజార్టీ సాధించి రికార్డు సృష్టించారు. మొదటిసారి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిపై విజయం సాధించగా, రెండోసారి మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ మనవరాలు సుహాసినిపై విజయం సాధించి అందరిని ఆశ్చర్యపరిచారు.

సంక్షేమ పథకాలు నియోజకవర్గ ప్రజలకు అందేలా ఎంతో కృషి...

షాదీముబారక్, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్, కార్పొరేషన్ రుణాలు నియోజకవర్గ ప్రజలకు అందేలా చూశారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం, మంచినీటి సరఫరా కోసం కృషి చేశారు. నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నాలుగు ఫ్లై ఓవర్‌లను నిర్మించారు. అదే విధంగా నియోజకవర్గంలో సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బ్యాగ్‌ల కిట్లు అందజేస్తున్నారు. దశాబ్దాలుగా రోడ్డు లేని దిల్‌కుష్‌నగర్ వాసులకు రూ.70లక్షలతో రోడ్డు వేయించి స్థానికుల మన్ననలు పొందారు. రూ.44లక్షల సొంత నిధులతో ప్రజలకు రెండు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే నియోజకవర్గంలో 90 శాతం పైగా పనులు పూర్తి చేశారు.

గెలిపించి అభివృద్ధిని కొనసాగించాలి



నియోజకవర్గ ప్రజల కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉండి అర్ధరాత్రి కూడా స్పందించే నాకు బీఆర్ఎస్ పార్టీ మరోసారి టిక్కెట్ కేటాయించటం ఎంతో సంతోషంగా ఉంది. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వంలో పనిచేసే అవకాశం దొరకటం నా అదృష్టం. నా తల్లిదండ్రుల ఆశీస్సులు, బీఆర్ఎస్ పార్టీ అండదండలతో మూడోసారి నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేస్తా. 4 దశాబ్దాలుగా ప్రజల సమస్యలను పరిపూర్ణంగా అవగాహన చేసుకున్న వ్యక్తిగా నా గురించి నా నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు. ఇప్పటి వరకు ప్రజలకిచ్చిన మాటను ఏ రోజూ తప్పలేదు. ఇప్పటికే నియోజకవర్గంలో 90 శాతం పైగా పనులు పూర్తి చేశాను. ఈసారి ప్రజలు నన్ను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించి కూకట్‌పల్లి అభివృద్ధిని కొనసాగించాలి.

– మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే

పేరు:	మాధవరం కృష్ణారావు
పుట్టిన తేదీ:	19-02-1967
తండ్రి :	కీ.శే. మాధవరం నారాయణరావు
తల్లి :	మాధవరం సక్కుబాయి
భార్య :	మాధవరం లక్ష్మీబాయి
పిల్లలు:	శ్రీలత, సందీప్ రావు
వృత్తి :	వ్యాపారం, భవన నిర్మాణ రంగం, ఆల్విన్ కంపెనీ మాజీ ఉద్యోగి
విజయం:	కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా రెండుసార్లు ఎన్నిక

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బాలాజీనగర్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్, వివేక్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన దళితుల ఐక్యవేదిక కేంద్ర కమిటీ సభ్యులు

కూకట్‌పల్లి: దళితుల ఐ క్యవేదిక కేంద్ర కమిటీకి నూతనంగా ఎన్నికైన సభ్యులు సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు యడ్ల ప్రభాకర్, నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఎమ్మెల్యే శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఎన్నికల అధికారి కర్క పెంటయ్య, ఎన్నికల అధికారులు నపారి చంద్రశేఖర్, బోడ నర్సింగరావు, ఎస్. లక్ష్మణ్, యాదయ్య, పుల్లారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ యడ్ల కవిత, ప్రధాన కార్యదర్శి యడ్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పెద్ది రాజు, ఇనుగంటి రాజు, లలిత, జాయింట్ సెక్రటరీ బడోళ్ల నగేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాతపల్లి శివ, కర్క నిఖిల్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎం. ప్రబాకర్ తదితరులు పాల్గొన్నారు.

